నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, శనివారం 13 జూలై 2024 | KHAMMAM


# మెనూ తప్పక అమలు చేయాలి

**జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**

చింతకాని, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ తప్పక అమలు చేయాలని, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, బోధనాభ్యసన ప్రక్రియ, మౌలిక వసతులు, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల బాగు కొరకు గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. సమైక్య రాష్ట్రంలో మరుగునపడిన వ్యవస్థలన్నింటినీ గత సీఎం కేసీఆర్ ఒక్కొక్కటిగా బాగు చేశారన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని, వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. సన్నబియ్యంతో భోజనం, వారానికి మూడు గుడ్లు, ఉచిత పాఠ్య, నోట్‌పుస్తకాలు, దుస్తులను ప్రభుత్వం అందిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి గ్రామానికి, పాఠశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాడూరి రామయ్య, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, కార్యదర్శి నిఖిల్, హెచ్‌ఎంలు రామ్మోహన్, జలీల్‌పాషా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పందిళ్ళపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

# సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టండి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



సేంద్రియ వ్యవసాయంపై ఆరా తీస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ములకలపల్లి, జూలై 12 : రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి లాభాలు గడించాలని, ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకుంటూ సాగును మరింతగా విస్తరించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ములకలపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన తొలుత జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటి మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను పరిశీలించారు. తర్వాత సేంద్రియ విధానం లో సాగు చేస్తున్న రైతు చందర్‌రావు పామాయిల్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి సాగు వివరాల గురించి తెలుసుకున్నారు. తేనెటీగలు, నాటుకోళ్ల పెంపకం, సేంద్రియ వ్యవసాయం చేస్తే వచ్చే లాభాలపై రైతులకు వివరించారు. అనంతరం రైతు చందర్‌రావు దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఏడీఏ అఫ్జల్‌బేగం, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ పుల్లారావు, కరుణమయి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# పామాయిల్ ప్రాభవానికి మసక?

- ఓ వైపు జన్యులోపంతో చనిపోతున్న చెట్లు
- మరోవైపు సగటున సగానికి పైగా తగ్గిన దిగుబడి
- ఇంకోవైపు అంతేవేగంగా పడిపోయిన ధరలు
- క్రమంగా నష్టాల్లో కూరుకుపోతున్న రైతులు
- దీర్ఘకాలిక పంటను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

దమ్మపేట, జూలై 12 : రాష్ట్రంలోనే పామాయిల్ హబ్‌గా పేరు గాంచిన అశ్వారావుపేట ప్రాంతంలో క్రమంగా ఆ పంట ప్రాభవం మసకబారుతున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జన్యులోపంతో కూడిన మొక్కల పంపిణీ దగ్గర నుంచి మొదలుకొని.. దిగుబడుల తగ్గుదల, ధరల పతనం, ప్రభుత్వ పట్టింపులేనితనం వంటివన్నీ తమ పాలిట శాపాలుగా మారుతున్నట్లుగా కన్పిస్తోందని పామాయిల్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండడం ఇందుకు బలం చేకూరుస్తోంది.



సుదాపల్లిలో చనిపోయిన పామాయిల్ చెట్టు

**పామాయిల్ సాగు అంటేనే 'పేట' అనేలా..**

పామాయిల్ సాగుకు పేరుగాంచి ఇప్పటివరకూ విరాజిల్లుతున్న ప్రాంతం అశ్వారావుపేట. రాష్ట్రం మొత్తంలో సాగవుతున్న 2.03 లక్షల ఎకరాల్లో సుమారు లక్ష ఎకరాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనివే. అందులోని అశ్వారావుపేట, దమ్మపేట పరిసర ప్రాంతాల్లోని నేలలు ఈ పంట సాగుకు యోగ్యంగా ఉండడం, స్థానికంగానే పరిశ్రమలు ఉండడం ఇక్కడి రైతులకు కలిసొచ్చే అంశం. అన్ని పంటలనూ తోసిరాజని గణనీయస్థాయిలో ఈ ప్రాంతంలో ఈ పంట సాగవుతోంది. దమ్మపేట మండలంలో మొత్తం 51 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే.. 35 వేల ఎకరాల్లోనూ, అశ్వారావుపేట మండలంలో 21 వేల ఎకరాల్లోనూ ఈ పంట సాగవుతోంది. ఈ పంటకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వాలు ఈ పంటను సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాయి. దేశ అవసరాల రీత్యా గణనీయస్థాయిలో కేంద్రంలో వివిధ దేశాల నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ.. రాష్ట్రం నుంచి సుమారు రూ.600 కోట్ల విలువైన పామాయిల్‌ను ఉత్పత్తి చేసి కేంద్రానికి అందిస్తున్న ఘనత ఇక్కడి పామాయిల్ రైతులది.

## పీడిస్తున్న చీడపీడలు.. పడిపోయిన దిగుబడులు

పామాయిల్ సాగు ఎంతవేగంగా విస్తరిస్తుందో అంతే వేగంతో చీడపీడల బెడద కూడా పెరుగుతోంది. ఇంతకుముందు వరకు ఎకరాకు సగటున 10-12 మెట్రిక్ టన్నుల మధ్య వచ్చే దిగుబడి.. ఇప్పుడు 5-7 మెట్రిక్ టన్నులకు పడిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు 2022 జూన్‌లో రూ.23,467 ఉన్న పామాయిల్ గెలల ధర 2024 నాటికి రూ.13,705కు పడిపోవడం రైతులను దెబ్బతీస్తోంది. పైగా పెరుగుతున్న సాగు ఖర్చులను.. ప్రస్తుత దిగుబడులను బేరీజు వేసినప్పుడు తాము మరింత నష్టాల్లోకి కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

## దిగుబడులు తగ్గడానికి కారణాలివేనా?

కానీ.. ఇటీవల పామాయిల్ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, తెల్ల దోమలు వంటివి కారణాలని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఈ కారణాలను రైతులు కొట్టిపారేస్తున్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు వచ్చి కనీసం తమ పంటలను కూడా పరిశీలించడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా పంటకు తెల్లదోమ, గానోడర్మా, స్టమ్ రాట్, రైనోసార్ బీటల్(రెడ్ ఫామ్ ఈవిల్), సంచి పురుగు(బ్యాగ్ వార్మ్)లు ఆశిస్తుండడం.. నివారణకు ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడం వంటివి కూడా దిగుబడుల తగ్గుదలకు కారణంగా ఉన్నాయి. అయితే, గతంలో విదేశాల నుంచి తెచ్చి ఇక్కడి రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన మొక్కల్లో అత్యధికంగా హాఫ్ టైప్(జన్యు లోపాలతో కూడిన) మొక్కలు కన్పిస్తున్నాయి. చెట్లు పెరిగి పంట దశకు చేరుకుంటున్న సమయంలో అవి జన్యు లోపంతో చనిపోతుడడంతో రైతులు లబోదిబోమంటున్నారు.



దమ్మపేట మండలం జగ్గారం గ్రామంలో చీడపీడలు సోకి చనిపోయిన పామాయిల్ చెట్లు

**రైతులను ఆదుకోవాలి..**

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా శాస్త్రవేత్తలను నియమించాలి. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సీఎస్‌ఆర్ నిధులను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రానికి కేటాయించాలి. వాటిని జీవ నియంత్రణ మందులు, జీవ నియంత్రణ ఎరువుల తయారీకి కేటాయించి రైతులను ఆదుకోవాలి.

**-తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అశ్వారావుపేట జోన్ అధ్యక్షుడు**



# సమన్వయంతో కేసుల పరిష్కారం

**భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు**



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు, హాజరైన పోలీస్ స్టేషన్ల రైటర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు

కొత్తగూడెం క్రైం, జూలై 12 : న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పాత కేసుల పరిష్కారానికి కృషి చేయాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు పోలీసు అధికారులకు సూచించారు. కొత్తగూడెంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు, రైటర్లు, టెక్ టీం ఆపరేటర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వీటిలో ఏమైనా సందేహాలుంటే డీసీఆర్‌బీ అధికారులకు తెలియజేసి వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. కేసు నమోదైనప్పటి నుంచి పరిష్కారం అయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని టెక్ టీం ఆపరేటర్లకు సూచించారు. ఈ క్రమంలో ఏవైనా సమస్యలుంటే ఐటీ సెల్ సహకారం తీసుకోవాలన్నారు. నేరస్తులకు శిక్షపడే విధంగా చేయడంతోపాటు బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, సీఐలు సంజీవరావు, అశోక్, వెంకటేశ్వర్లు, కరుణాకర్, శివప్రసాద్, సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 12 : నగరంలోని ఎస్ ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎప్‌సెట్-2024 ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. శుక్రవారం 480 మంది స్లాట్స్ బుక్ చేసుకోగా 470 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

**దోస్త్ సర్టిఫికెట్ల పరిశీలన గడువు పొడిగింపు..**

డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా గత మూడు విడతలో సీట్లు పొందిన విద్యార్థుల కోసం సర్టిఫికెట్ల పరిశీలన గడువు ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విజయ డెయిరీ పార్లర్ ఎదుట ఆందోళన





విజయ డెయిరీ పార్లర్ ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు

రఘునాథపాలెం, జూలై 12 : విజయ డెయిరీ పార్లర్ నిర్వహణను స్థానికులకే కేటాయించాలంటూ రోటరీనగర్ వాసులు ఆందోళన చేపట్టారు. స్థానికులకు కాకుండా ఓ ఏజెన్సీకి అనుమతులు తెచ్చుకోవడంతో విషయం తెలిసి స్థానికులు పెద్దఎత్తున పార్లర్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. వివరాల్లోకెళ్తే.. ఖమ్మం విజయ డెయిరీ ఎదుట పాలు, పాల ఉత్పత్తులను విక్రయించేందుకు కేటాయించిన పార్లర్‌ను గతంలో స్వాతి ఏజెన్సీకి కేటాయించారు. అయితే గడువు ముగియడంతో గత కొద్దిరోజులుగా పార్లర్ నిర్వహణ ఆగిపోయింది. ఎన్నికల అనంతరం తిరిగి స్వాతి ఏజెన్సీ నిర్వాహకులే తిరిగి అనుమతులు తెచ్చుకోవడంతోపాటు శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. విషయం తెలిసిన రోటరీనగర్ వాసులు పార్లర్ వద్దకు చేరుకొని ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారు. పార్లర్ ఎదుట బైఠాయించి పునఃప్రారంభించకుండా నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువురిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. అయితే స్వాతి ఏజెన్సీ వారికి అనుమతులు ఉండడంతో ఆందోళన చేసిన వారిని పోలీసులు హెచ్చరించి పంపినట్లు తెలిసింది.





మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడులు జాటోత్ హుస్సేన్‌నాయక్

## ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం..

# అధికారులు కృషిచేయాలి

- గిరిజనుల సమస్యల పరిష్కారం కోసమే జాతీయ ఎస్టీ కమిషన్
- ఖమ్మం పర్యటనలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్
- 'గిరిజనుల సంక్షేమం – ప్రభుత్వ పథకాల'పై కలెక్టరేట్‌లో సమీక్ష

మామిళ్లగూడెం, జూలై 12: ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం అధికారులు కృషిచేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసమే జాతీయ స్థాయిలో ఎస్టీ కమిషన్ పని చేస్తోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 'గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు – ఎస్టీ సబ్ ప్లాన్' తదితర అంశాలపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అడిగిన చోట్ల.. ప్రవేశ పరీక్షలతో సంబంధం లేకుండా సీట్లు కేటాయించాలని, ట్రైకార్ లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని, పోడు పట్టాల విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన వికాసంపై గిరిజనులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు, ఖర్చులు, మిగుల్లపై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం కోసం వివిధ శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద 2022లో కొత్త దరఖాస్తులు స్వీకరించి 6,589 మందికి 13 వేల ఎకరాల భూమిపై హక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేశామని వివరించారు. ఎకో టూరిజంలో గిరిజనులకే ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, బోధన వంటివన్నీ ఉచితంగానే అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కమిషన్ సభ్యుడు వినతులు స్వీకరించారు. పరిష్కార చర్యల కోసం వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, నరేశ్‌కుమార్, ఎం.రాజేశ్వరి, విజయలక్ష్మి, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**గిరిజనుల కోసమే కమిషన్ పనిచేస్తుంది**

గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారం కోసమే జాతీయ ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ పేర్కొన్నారు. జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం ఖమ్మానికి చేరుకున్న ఆయన.. ఇక్కడి ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా గిరిజనులకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులు దక్కేవిధంగా కమిషన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. దేశంలో వివిధ గిరిజనులకు సంబంధించిన వివిధ అంశాలకు చెందిన 20 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ఇక నుంచి హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

# తాలిపేరు.. లేదు నీరు

**మండలంలో ఇంకా నిండని జలాశయం**

**చిన్న జల్లులు తప్ప పెద్దగా కురవని వర్షాలు**

**ఫలితంగా చెరువులకూ చేరని వరద నీరు**

**కళ తప్పిన ఆయకట్టు..**

**ఆందోళనలో కర్షకులు**

చర్ల, జూలై 12 : ఏజెన్సీ ప్రాంతంలో చిన్న చిన్న జల్లులు తప్ప ఇంకా పెద్దగా వర్షాలు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రధాన జలవనరు అయిన తాలిపేరు ప్రాజెక్టు వెలవెలబోతోంది. పెద్ద వర్షాలు లేని కారణంగా చర్ల మండలంలోని చెరువుల్లోకి నీరు చేరలేదు. ఫలితంగా తాలిపేరు, ఇతర చెరువుల కింద ఆయకట్టు కళతప్పినట్లుగా కన్పిస్తోంది. అక్కడక్కడా కొందరు రైతులు నారుమళ్లను వేస్తుండడం, పొలాలను సిద్ధం చేస్తుండడం వంటి దృశ్యాలు కన్పిస్తున్నప్పటికీ వరి సాగు పెద్దగా ముందుకు కదలడం లేదు. సరైన వర్షాలు కురవకపోవడం, జలాశయాల్లోనూ నీరు లేకపోవడం వంటి కారణాలతో కర్షకులు కూడా ఆందోళన చెందుతున్నారు.

**24 వేల ఎకరాల ఆయకట్టు**

చర్ల మండలంలోని తాలిపేరు జలాశయం కింద చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం ప్రాంతాల పరిధిలో 24,400 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. కేవలం చర్ల మండలంలోనే ఏటా 17 వేల ఎకరాల్లో వరి సాగవుతుంటుంది. ఇందులో కేవలం ఏడు వేల ఎకరాలు తాలిపేరు రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద, మరో పది వేల ఎకరాలు వర్షాధారం, చెరువులు, కుంటల కింద సాగవుతుంటాయి. అయితే ఈ వానకాలంలో జూలై నెల కూడా ప్రవేశించి పక్షం రోజులు అవుతున్నాయి. అయినప్పటికీ ఈ ప్రాంతంలో మధ్యతరహాకు చెందిన తాలిపేరు సాగునీటి ప్రాజెక్టులో ఇప్పుడు నీళ్లు అడుగంటడం, వర్షాలు కూడా సమృద్ధిగా కురవకపోవడం వంటి కారణాలతో ఇక్కడి అన్నదాతలందరూ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

**రైతులు ఆందోళన చెందొద్దు..**




0.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన తాలిపేరు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులోకి ఇంకా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌లోకి వస్తున్న నీటిని నిలుపుతాం. రైతుల అవసరాలకు వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. **-తిరుపతి, డీఈ, తాలిపేరు ప్రాజెక్టు**

**గట్టి వర్షాలు రాకపోతే సాగుకు ఇబ్బందే..**



వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురవలేదు. ఇప్పటికైనా గట్టి వర్షాలు రాకపోతే పంటల సాగుకు ఇబ్బంది అవుతుంది. ఇప్పటికే అక్కడక్కడా రైతులందరమూ పొలాలను దున్ని సిద్ధంగా ఉంచుకున్నాం. కొన్ని ప్రాంతాల్లో రైతులు నార్లు కూడా పోసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద వర్షాలు పడితే పనులు ముందుకు సాగుతాయి.

**-శ్రీనివాస్, రైతు, లింగాపురంపాడు**



# బొగ్గు బ్లాకుల వేలం వద్దే వద్దు..

- బ్లాకుల ప్రైవేటీకరణను రద్దు చేయాలని ఏఐటీయూసీ ధర్నా
- ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరు టౌన్, జూలై 12 : సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ దీక్షల్లో భాగంగా శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి విస్తరణను క్రమక్రమంగా నిలిపివేసి బొగ్గు బ్లాకులను వేలం వేస్తూ సింగరేణి భవిష్యత్‌ను, ఆ ప్రాంత అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని, దానిని గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ అడ్డుకుంటుందన్నారు. ప్రైవేటీకరణ జరిగితే మరో పదేళ్ల తర్వాత సింగరేణి సంస్థ కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మణుగూరు ఓసీ-2తోపాటు మొత్తం 9 గనుల విస్తరణ అనుమతులు, బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అనంతరం బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, నాగరాజు, ఆదర్ల సురేందర్, సీపీఐ నాయకులు మున్నా లక్ష్మీకుమారి, సర్వర్, దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేమిడిచర్లలో కేంద్ర అధికారుల పర్యటన

**పారిశ్రామికవాడకు కేటాయించిన స్థల పరిశీలన**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎర్రుపాలెం, జూలై 12 : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవతో మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో సర్వేనెంబర్ 372లో పారిశ్రామికవాడకు కేటాయించిన 53.18 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం కేంద్ర ప్రభుత్వాధికారుల బృందం పరిశీలించింది. డ్రోన్ల సహాయంతో పని చేయనున్న పరికరాలను పరీక్షించేందుకు ఆసియాలోనే మొట్టమొదటిగా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జమలాపురం గ్రామంలోని ఓ కల్యాణమండపంలో సమావేశమయ్యారు. ఎర్రుపాలెం మండలంలో జాతీయ రహదారి రానుందని, ఏపీ రాష్ట్రానికి, దాని దగ్గరగా ఈ ప్రాంతం ఉందని, రైల్వే జోన్ కూడా రానుండడంతో ఈ ప్రాంతం అన్నివిధాల డ్రోన్ పరీక్షా కేంద్రానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ ఎం.ఉషా శారద, ఆర్‌ఐలు రవికుమార్, రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.